సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వర రావు

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

- సబ్సిడీలను వినియోగించుకోండి
- కలెక్టర్ కోటేశ్వర రావు
- ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

మత్స్యకారుల సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ కోటేశ్వరరావు, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్స్యకార శాఖ సొసైటీ ఆధ్వర్యంలో 40 శాతం జనరల్ వారికి, 60 శాతం ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. సొసైటీ సభ్యులు రూ.10 లక్షల విలువ చేసే ఒక ఫిష్ కియోస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సుంకేసుల డ్యామ్ వద్ద ఉమెన్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా 39 మంది మహిళలు నడుపుకోవడానికి ముందుకొచ్చిన వారికి 60 శాతం సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు మరెన్నో సబ్సిడీలను అందిస్తోందని తెలిపారు. వాటిని మత్స్యకారులు ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, మత్స్యశాఖ జెడి శ్యామల, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై ఇంటింటి సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకున్న సుస్థిర అభివృద్ధికి సంబంధించిన 8 అంశాలపై ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ కోటేశ్వరరావు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారులతో నేరుగాను, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు సేవలందించాలని సచివాలయాల్లో ఉన్నత చదువులు చదివిన వారిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. వీరంతా సక్రమంగా పని చేసేలా సంబంధిత జిల్లా అధికారులతో పాటు సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయంలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు రీ ఓపెన్ అయిన దరఖాస్తులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. హౌసింగ్ అంశంపై సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు ప్రతి వారం సమీక్షించాలని తెలిపారు. ఇళ్లు కట్టించుకోలేక మొదలు పెట్టని ఇళ్లను థర్డ్ ఆప్షన్ కింద నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెసి రామ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎదురుచూపు...

- ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు బకాయిలు పెండింగ్‌లోనే
- జిల్లాలో బకాయిల విలువ రూ.200 కోట్లు
- నేడు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం' ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు ఇవి. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు విడుదల చేయాల్సిన ఆర్థిక పరమైన బకాయిలను విడుదల చేయకుండా పక్కన పెట్టేసింది. రిటైర్మెంట్ బెనిఫిట్లు అందకపోవడంతో ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరాశలో ఉన్నారు. ఈ పెండింగ్ బకాయిలు ఎప్పుడు విడుదల అవుతాయోనని కొన్నినెలలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగులు ఉపాధ్యాయుల పెన్షనర్లకు సంబంధించిన బకాయిలు దాదాపుగా రూ 200 కోట్లకు పైగానే పెండింగ్లో ఉన్నాయని ఖజానా శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచింది. కానీ ఉద్యోగులు సర్వీస్ కాలంలో ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ బకాయిలు, మెడికల్ రియంబర్స్మెంట్ ఇప్పటివరకు పెండింగ్లోనే ఉన్నాయి. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన జిఐఎస్, ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఆర్థిక సంబంధమైన సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్లో ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెన్షనరీ బెనిఫిట్స్ ఎప్పుడు విడుదల అయితాయో కూడా తెలియనటువంటి అయోమయ స్థితిలో ఉన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థికపరమైన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. రిటైర్డ్ అయిన వారికి చెల్లించాల్సిన పెన్షన్ బెనిఫిట్స్, జిపిఎఫ్ ఇతరత్రా ఆర్థిక పరమైన బకాయిలను త్వరగా విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నాం. ఈ నెల 30న రాష్ట్ర రాజధానిలో కూడా ఆందోళనను తెలియజేయనున్నాం. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి.

ఉద్యోగులకు చెల్లించాల్సిన, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయకుండా ఉద్యోగుల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. జిల్లాల పునర్విభజన పేరుతో ఉద్యోగులను పెద్ద ఎత్తున కొత్త జిల్లాలకు తరలించి అక్కడ ఎలాంటి వసతులూ లేకపోయినా ఉద్యోగులు మాత్రం స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. శాఖ కార్యాలయాల నిర్వహణకు ఒక పైసా నిధులు విడుదల చేయకపోయినా ఏదో విధంగా పాలన మాత్రం కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయులను పాఠశాలల్లో బోధన అంశాలకు ఉపయోగించుకోవాల్సింది పోయి బోధనేతర పనులను అప్పగించినా ఎంతో చిత్తశుద్ధితో చేస్తున్నారు. పిఆర్‌సిలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వీరికి తీవ్ర అన్యాయం చేసింది. కనీసం వీరికి చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను త్వరగా చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఆరోగ్యశ్రీ'ని పటిష్టంగా అమలు చేద్దాం

- అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి
- కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య అధ్యాపకులతో సమీక్ష

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేద్దామని అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో వైద్య అధ్యాపకులతో ఆరోగ్యశ్రీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో ఉన్న వైద్య అధ్యాపకులతో సమీక్ష నిర్వహించి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ అమలును మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా కొన్ని విభాగాలు డిస్మాండింగ్‌లో వెళ్తున్న సందర్భంగా వారిని సర్దుబాటు చేసే విధంగా వైద్య అధ్యాపకుల నుంచి పలు సూచనలు తీసుకున్నారు. అనంతరం అడిషనల్ డిఎంఇ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైద్య అధ్యాపకులు, ఆస్పత్రి సిబ్బంది కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, వైద్య అధ్యాపకులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ శ్రీలక్ష్మి, నోడల్ ఆఫీసర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబల నగంజన్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి

చలి పంజా

- పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో చలి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండ్రోజుల కిందట రాత్రి వేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉదయం కూడా ప్రభావం చూపుతోంది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తోంది. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండలో పగటి పూట అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం ఆదోనిలో అత్యధికంగా 24 డిగ్రీల సెంటిగ్రేడ్, అత్యల్పంగా 14 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు, ఎమ్మిగనూరులో అత్యధికంగా 24 డిగ్రీలు, అత్యల్పంగా 14 డిగ్రీలు, పత్తికొండలోనూ అత్యధికంగా 24 డిగ్రీలు, అత్యల్పంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆలూరులో అత్యధికంగా 25 డిగ్రీలు, అత్యల్పంగా 15, కర్నూలులో అత్యధికంగా 25 డిగ్రీలు, అత్యల్పంగా 18 డిగ్రీలు, కోడుమూరులోనూ అత్యధికంగా 25 డిగ్రీలు, అత్యల్పంగా 18 డిగ్రీలు, మంత్రాలయంలో అత్యధికంగా 26 డిగ్రీలు, అత్యల్పంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లను కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. చలి పంజా విసురుతుండడంతో ఉదయం, రాత్రి వేళలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులు ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చలికి బయట తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటిలోనూ చలి తీవ్రత పెరిగితే వేడి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆలూరు మండలంలో కప్పుకున్న పొగ మంచు (ఫైల్)

నిధులు తిరిగి చెల్లించాలి

- భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధులు కేటాయించాలి - సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధులు కేటాయించి, జగన్ ప్రభుత్వం వాడుకున్న సంక్షేమ నిధులను తిరిగి చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాజా పాషా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల సంఘానికి సంబంధించిన రూ.435 కోట్ల నిధులు ఇతర సంక్షేమ పథకాలకు వాడుకున్నారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వస్తే టిడిపి ప్రభుత్వంలో వాడుకున్న సంక్షేమ నిధులను జమ చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేశారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిఒ 17ను తీసుకొచ్చి రూ.835 కోట్ల భవన నిర్మాణ కార్మికుల నిధులను ఖజానాకు మళ్లించారని మండిపడ్డారు. మెమో నెంబరు 12, 14 తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికుల నుంచి ఎలాంటి దరఖాస్తులూ తీసుకోరాదని ఆపేశారని చెప్పారు. ఆ మెమోలను వెంటనే విరమించుకొని భవన నిర్మాణ కార్మికుల నిధులను విడుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలన్నింటినీ వారికి చెందేలాగా జగన్ ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణానికి కావాల్సిన ఇసుకను రద్దు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా ఇసుకను ఉచితంగా ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతులు ఇచ్చినా, ధర్నాలు చేసినా, రాస్తారోకోలు చేసినా ఏమాత్రం స్పందించడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి ప్రభుత్వం తీసుకున్న నిధులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ దిగ్బంధనం చేయడానికి కార్మికులు సన్నద్ధం కావాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు యు.ఈరన్న, నాయకులు అబ్దుల్ దేశాయ్, నరసింహులు, ఏసయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

పేదల అభ్యున్నతికి పునాదులు : ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి -కోడుమూరు

పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు పునాదులు వేస్తున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పథకాలతోనే పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. సోమవారం కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మేనిఫెస్టో విడుదల చేసి ప్రభుత్వం వచ్చాక 90శాతం పథకాలను అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. సచివాలయాల ద్వారా వేల మందికి ఉపాధి కల్పించి రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలను విడుదల చేయబోతున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రతిపక్ష నాయకులు విమర్శించడం చాలా విడ్డూరమన్నారు. రాబోయే రోజుల్లో మరోసారి టిడిపి నాయకులకు పరాజయం తప్పదన్నారు. సర్పంచి మాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్: నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి వైద్య జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని తెలుగు యువత నేతలు సోమిశెట్టి నవీన్, అబ్బాస్,గోపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. ఏడాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఆ సంఘం నేతలు సోమిశెట్టి నవీన్ అబ్బాస్ గోపాల్ రెడ్డిలతో పాటు మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ రాజశేఖర్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోనే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని వారు పేర్కొన్నారు. టిడిపి నేతలు గుణ్ణ మార్క్, పాల్ రాజ్ రెడ్డి పోగు బజారన్న, సంజీవ లక్ష్మి చంద్రకళభాయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభాంత్ కార్మికులకు వేతనాలివ్వాలి : సిఐటియు ధర్నా

ప్రజాశక్తి తుగ్గలి

గ్రామాలలో స్వచ్ఛభారత్ కింద పనిచేస్తున్న కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలని, గ్రామపంచాయతీకి సంబంధం లేకుండా వారి ఖాతాలోకే నేరుగా వేతనాలుజమ చేయాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, ప్రతాప్, మద్దిలేటి ఆధ్వర్యంలో సోమవారం తుగ్గలి ఎంపిపి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని ర్యాలీగా ధర్నా చేశారు. ఎఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు అంజి, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ గ్రామాలలో స్వచ్ఛభారత్ కింద పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉదయం నుండి సాయంత్రం దాకా కాలువలలో చెత్తాచెదారాన్ని తీసివేసే కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. నెలలు గడుస్తున్నా స్వచ్ఛభారత్ కార్మికులు వేతనాలు అందకపోవడంతో ఆందోళనకు గురికాక తప్పడం లేదన్నారు. గ్రామ పంచాయతీకి వేతనాలు లింకు పెట్టి ఇవ్వకపోవడం మరీ దారుణమన్నారు. ఇలాగే కొనసాగితే పారిశుధ్య కార్మికుల పరిస్థితి ఆ గమ్య గోచరంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. పెండింగులో ఉన్న ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి కొండారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు మద్దిలేటి, ఆనందు, రంగన్న, ఆంజనేయులు, బెన్నీ రామాంజనేయులుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు.

తుగ్గలి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మార్కెట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం జిల్లా మహాసభ ఆదోని వ్యవసాయ మార్కెట్ నందు ఉమ్మడి జిల్లా (కర్నూలు , నంద్యాల) అధ్యక్షులు కె. శ్రీరాములు, రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం, ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటిల ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని అధ్యక్షులు తెలుగు నాగరాజు అన్నారు. అధ్యక్షులు తెలుగు నాగరాజు, పివి. కిరణ్ గౌరవాధ్యక్షులు, కృష్ణ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులుగాబాబు, రంగస్వామి, కాశన్న ,ట్రెజరర్‌గా పి. బతుకన్న, ప్రధాన కార్యదర్శి గా పి. శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా జి. చెంచన్న, జి. వీరేష్, డి. రాములమ్మను ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆదోని మార్కెట్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిని కర్నూలు మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారెడ్డి లను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చం అందించి కలిశారు.ఈ కార్యక్రమంలో యార్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కార్శిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిటీ నాయకత్వం

గ్రంథాలయంలో బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -మద్దికెర: మద్దికెర గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో సోమవారం జడ్పిటిసి మురళీధర్ రెడ్డి చేతులు మీదుగా విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ నేటి యువత గ్రంథాలయాలకు వచ్చి మేధోశక్తి పెంచుకోవాలన్నారు. గతంలో న్యూస్ పేపర్లు, మ్యాగజైన్స్, కథలు, నవలలు, చరిత్ర పుస్తకాలు చదివేందుకు యువకులు వచ్చేవారన్నారు. ఇప్పుడు మొబైల్స్ వచ్చాక గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిందన్నారు. ప్రభుత్వం వెల్లడించే వివిధ నోటిఫికేషన్లలో ఉద్యోగం సాధించేలా అభ్యర్థులను సిద్ధం చేసే వేదికలుగా గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. పంచాయతీ సలహాదారుడు బండారి అంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ లో రాణించిన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-సి బెళగల్

ఇటీవల ప్రభుత్వం కృష్ణా జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడను చేపట్టింది. అందులో సి.బెళగల్ గురుకుల ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు ఎం.విజయ్, అఖిల్, అశోక్, అరవింద్‌లు రాణించారు. సోమవారం ప్రిన్సిపల్ బలరాం, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరప్ప, వాణి, జయాకర్, బాందవి, వాసుదేవ రెడ్డి, కోచ్ రవి సమక్షంలో అభినందనలు తెలిపారు. అలాగే మెమంటోలు అందజేశారు.

విజేతలతో ఉపాధ్యాయులు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

మొదలైన ఇసుక అక్రమ రవాణా

ప్రభుత్వాదాయానికి చిల్లులు

ప్రజాశక్తి సి బెళగల్ : మండలంలోని నదీతీరం వెంట ఆయా గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా మొదలైంది. మండలంలోని నదీతీరంవెంట 9 గ్రామాలున్నాయి. అందులో ఎగువన తిమ్మందొడ్డి, మాలసోమాపురం గ్రామాల సమీపంలో జలం తగ్గిందంటే చాలు ఇసుక మేటల నుండి ఇసుకను అక్రమంగా తరలించుకొని పోవడానికి అనుకూలంగా మారుతుంది. ఇదే తరుణంలోనే ఇసుక అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటారు. అక్రమార్కుల, అధికార పార్టీ అండదండల మాటున అధికారులకు అంచనాలకు మించి మాముళ్ళు అందుతుంటాయనే ఆరోపణలున్నాయి. మండలంలోనే కాకుండ ఇతర ప్రాంతాలకు కూడా ఇదే నదీతీరం వెంట తిమ్మందొడ్డి, మాలసోమపురం, గుండ్రేవుల వద్ద నుండి భారీగా వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు పట్టించుకోని సంఘటనలు కూడా చోటుచేసుకొన్నాయి. శనివారం ఆదివారం వచ్చిందంటే చాలు ఫలితంగా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొడుతూ చిల్లులు పడేస్తున్నారు. ఈ ఆదివారం తిమ్మందొడ్డి వద్ద భారీగా ఇసుక అక్రమ రవాణా జరిగింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్కడక్కడా సిసి కెమెరాలు ఏర్పాట్లు చేసి ఇసుక అక్రమరవాణాను అరికట్టి అక్రమార్కులపై గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

'జీవో నెంబర్ 53ను రద్దుచేయాలి'

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 53 రద్దు చేయాలని షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ పరిరక్షణ పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నేతలు దండు వీరయ్య, ధరూర్ జేమ్స్, సోమ సుందరం, అశోక రత్నం రాధాకృష్ణ చంద్రప్పలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి కులాల జాబితాలోకి చేర్చేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కులస్థితిగతులు అంటరానితనం పైన ఆధారంగా తీసుకొని ఎస్సీల జాబితాలోకి చేర్చాలని జెసి శర్మ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అనవసరంగా ఇతర కులాలను ఈ జాబితాలోకి చేర్చడం సమంజసం కాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 53 రద్దు చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమితి నాయకులు సుధాకర్ వెంకటేష్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి స్వీకరించిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను సూచించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. వ్యవస్థ పట్ల నమ్మకం కలిగేలా స్పందన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. బాధితులు అడిగిన సమస్యలు అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరిస్తే బియాండ్ ఎస్ఎల్ఎ అర్జీలు ఉండవన్నారు. అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్య పరిష్కారం అవుతుందా లేదా స్పష్టంగా అర్జీదారునికి అర్థమయ్యే విధంగా వివరించాలని తెలిపారు. డిఎల్‌డిఒ నూర్జహాన్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సత్యవతి, ఓఎల్‌డిఒ రామలింగేశ్వర రెడ్డి, పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బి డిఇ వెంకటేశ్వర్లు, ఎపిఎస్‌డబ్ల్యు సుధాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఆర్‌ఐ జ్యోతిర్మయి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం కోసిగిలోని సచివాలయం-2 పరిధిలోని 1 నుంచి 6వ వార్డు వరకు 'గడప గడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. ఎంపిపి ఈరన్న, కోసిగి మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎపిఎం సత్యమ్మ, ఎపిఒ జయరాం, మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్, వైసిపి యువజన విభాగం జిల్లా నాయకులు మఠం జగదీష్ స్వామి, వైసిపి సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, హోళగుంద కోసిగయ్య, మాజీ జడ్‌పిటిసి బి.మంగమ్మ, మాణిక్య రాజు, వి.వెంకటేష్, నాడిగేని నాగరాజు, పంపికోన నాగేష్, కోఆప్షన్ సభ్యులు షౌకత్ అలీ, దొడ్డి నరసన్న, కాంట్రాక్టర్ బసి రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట

ప్రజాశక్తి - నందవరం

భూమి పూజ చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మాచాపురం ఎంపిపి స్కూల్లో నాడు - నేడు పనులకు భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని తెలిపారు. మాచాపురం గ్రామంలో నాడు - నేడు పథకం కింద పాఠశాల మరమ్మతులకు రూ.27 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. రూ.25 లక్షలతో గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణ పనులు చేస్తామని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించి, వేగవంతంగా పూర్తి చేయాలని పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులకు సూచించారు. అనంతరం సర్పంచి పద్దెది కిష్టప్ప, వైస్ ఎంపిపి అగ్నేశమ్మలు మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస్ రెడ్డి, ముగతి సర్పంచి విరూపాక్షి రెడ్డి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, ఉప సర్పంచి సొప్పం కోటప్ప, వైసిపి సీనియర్ నాయకులు ఆగోలి గాలెన్న, పల్లెద్ది కోటేశ్వర రావు, సత్యన్న పాల్గొన్నారు.

ఆదోనిలో తగ్గిన పత్తి ధర

ఆదోనిరూరల్ : వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి ధర క్వింటా రూ.8,999 పలికింది. పత్తి ధర రూ.226 తగ్గడంతో రైతులు విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం క్వింటా పత్తి కనిష్ట ధర రూ.5,519, మధ్య ధర రూ.8,429, గరిష్ట ధర రూ.8,999 వరకు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 1303 (5748 క్వింటాళ్లు) లాట్ల పత్తి వచ్చినట్లు చెప్పారు.

ఆగని వలసలు...

- ఖాళీ అవుతున్న గ్రామాలు
- ఉపాధి పనులు కల్పిస్తామంటున్న వలస వెళ్తున్న కూలీలు

ప్రజాశక్తి - హోళగుంద

'ఉపాధి పనులు కల్పిస్తాం. గ్రామాలు వదిలి వెళ్లకండి' అని అధికారులు చెప్పినా వలస కూలీలు అధికారుల మాటలు పట్టించుకోవడం లేదు. ఉపాధి పనుల వల్ల తమకు పెద్దగా లాభం లేదని, సరైన సమయానికి కూలి బిల్లులు రావని, పట్టణాలకు వెళ్లి పొట్ట నింపుకోవడమే మేలని వలస కూలీలు పేర్కొనడం విశేషం. హోళగుంద నుంచి ఇప్పటికే దాదాపు 200 కుటుంబాలు బెంగళూరు, హైదరాబాద్, గుంటూరు వంటి పట్టణాలకు వలస వెళ్లారు. సోమవారం ఉదయం కూడా హోళగుంద బీసీ కాలనీ నుంచి సుమారు 60 కుటుంబాలు వలస వెళ్లాయి. రోజురోజుకూ గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మండలంలోని గజ్జహళ్లి, వందవాగలి, హెబ్బటం గ్రామాల నుంచి గత 15 రోజుల క్రితమే వలస వెళ్లారు. ఈ ఏడాది పది ఎకరాల పొలాలున్న రైతు కుటుంబాలు సైతం వలస బాట పట్టాయి.

ప్రస్తుతం గ్రామాల్లో అతివృష్టి, అనావృష్టి కారణంగా చేతికొచ్చిన పంటలన్నీ నాశనమయ్యాయి. రైతులు పెట్టుబడి కోసం ఫర్టిలైజర్ షాపుల్లో, ప్రయివేట్ వ్యక్తుల దగ్గర అప్పులు చేశారు. అప్పుల సంగతి అలా ఉంచితే చేతినిండా పని లేకపోవడం, పూట గడవడం కష్టంగా మారింది. గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు కూలి వస్తుంది. పొట్ట పోసుకోవడమే కాకుండా చిన్న, చిన్న అప్పులు సైతం తీర్చుకోవడానికి వీలవుతుందని, వలస వెళ్లడానికి నిర్ణయించుకున్నట్లు రైతులు, కూలీలు పేర్కొన్నారు.

పొట్ట పోసుకోవడానికి వలస

సంపాదించడానికి కాదని, పొట్ట పోసుకోవడానికి వలస వెళ్తున్నామని వలస కూలీలు పేర్కొనడం బాధాకరం.

సోమవారం వలస వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బీసీ కాలనీ వాసులు

ప్రస్తుతం గ్రామాల్లో కొంతవరకు కూలి పనులు ఉన్నా, కొందరికి పని దొరికినా, అందరికీ పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతేడాది ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నాం. రైతుల పంట పొలాలు అధిక వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బ తిన్నాయి. తమకు ఎకడ పనులు దొరుకుతాయని కూలీలు వాపోయారు.

'ఉపాధి'తో కడుపు నిండుతుందన్న భరోసా లేదు

ప్రభుత్వ అధికారులు హడావిడి చేసి ఉపాధి పనులు కల్పించినా ఉపాధి పనుల వల్ల తమ కుటుంబాల కడుపులు నిండుతాయన్న భరోసా లేదని వలస కూలీలు, రైతులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించినా ఒక్కొక్కరికి కూలి రూ.200 మించి పడదని, సరైన సమయానికి కూడా కూలి డబ్బులు రావని చెబుతున్నారు. నెలల తరబడి కూలి కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ప్రతేడాది చూస్తున్నామని వాపోతున్నారు. వలస వెళ్లిన దగ్గర ఒక్కొక్కరు రూ.500 నుంచి రూ.600 వరకు సంపాదిస్తామని చెబుతున్నారు.

పనులు కల్పిస్తాం - ఎంపిడిఒ దాస్ నాయక్

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పిస్తాం. ఎవరూ వలస వెళ్లవద్దు.

పశువులకు వ్యాక్సిన్‌లు వేస్తున్న పశు వైద్యాధికారి జగదీష్

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మండల పశు వైద్యాధికారి జగదీష్

ప్రజాశక్తి - కౌతాళం

లంపీ స్కిన్ వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి జగదీష్ కోరారు. సోమవారం మండలంలోని గుడికంబాలి గ్రామాన్ని సందర్శించి పశువులకు వ్యాక్సిన్‌లు వేశారు. 'వెంటాడుతున్న లంపీ స్కిన్ వ్యాధి - మృత్యువాత పడుతున్న మూగజీవాలు' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు తెలిసిందే. అధికారులు స్పందించి గ్రామంలో పాడి రైతులకు తగిన సూచనలు చేశారు. 15 మూగజీవాలు లంపీ స్కిన్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వాటితో పాటు మరికొన్ని పశువులకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేసినట్లు ఆయన తెలిపారు. పశువులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యాధికారుల వద్దకు తీసుకురావాలన్నారు. ఈ వ్యాధి వ్యాపించకుండా పశువుల మధ్య దూరం ఉండేలా చూడాలన్నారు. నాయుడు, నరసింహులు, హాల్వి నరసింహులు పాల్గొన్నారు.

సమస్యలపై సమిష్టిగా పోరాడదాం

- సర్పంచుల సంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సమిష్టిగా పోరాడదామని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు గూళ్యం హరికృష్ణ కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్పంచుల సంఘం సమావేశం నిర్వహించారు. మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారని, వాలంటీర్లకు ఉన్న విలువ కూడా సర్పంచులకు లేదని మండిపడ్డారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా ప్రజలు ఓటు వేసి గెలిపించారని సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. కేంద్రం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక పంచాయతీ నిధులను పంచాయతీ ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా కేంద్రాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సర్పంచుల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గూళ్యం హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా నెల్లూరప్ప, కార్యదర్శిగా దుర్గప్పగారి సావిత్రమ్మ, కోశాధికారిగా పెద్దిరెడ్డితో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను పూలమాలలతో సన్మానించారు. వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, కోకన్వీనర్ పురుషోత్తం రెడ్డి, ఎంపిటిసి రాధాకృష్ణ, సర్పంచులు వెంకటేష్, తోయజాక్షప్ప, నాయకులు మురళీమోహన్, పెద్దిరెడ్డి, శివారెడ్డి, నాయుడు, బద్రి, నాగేంద్ర, రంగన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

పి.కోటకొండలో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి- దేవనకొండ

ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న సాయిబాబా

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో డెంగీ కేసు నమోదయినట్లు పత్తికొండ సబ్ డివిజన్ మలేరియా యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. డెంగీ కేసు నమోదు విషయం తెలుసుకున్న ఆయన ప్రాథమిక వైద్య సిబ్బందితో కలిసి సోమవారం గ్రామాన్ని సందర్శించి కేసు నమోదు అయిన కుటుంబాన్ని పరిశీలించారు. గ్రామంలో ఏడేళ్ల బాలుడు దస్తగిరికి డెంగీ జ్వరం వచ్చినట్లు నిర్ధారించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ... ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

పట్టణ మహాసభను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఈనెల 26న నిర్వహించే ఎస్ఎఫ్ఐ 5వ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం, పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. నూతన విద్యా విధానం పేరుతో పేద విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేయడం తగదన్నారు. మహాసభలో విద్యారంగ సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆలిండియా, రాష్ట్ర నాయకులు, ప్రముఖ వక్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొననున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, రామానాయుడు, రఘు, గణేష్, గౌస్ పాల్గొన్నారు.

'స్పందన' దరఖాస్తులకు పరిష్కారం : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తున్నామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు. స్పందనలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు ఒక వినతిపత్రం వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. సూపరింటెండెంట్ సుధాకర్ రాజు, ఇఒఆర్‌డి సంజన్న, ఎఒ జయలక్ష్మి, ఎంఇఒ మస్తాన్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్‌లీలా, ఎపిఎం నాగార్జున పాల్గొన్నారు.

తాగుబోతులతో విసిగి పోతున్నాం

- ఎంఆర్ బార్ నిర్వాహకులపై స్థానిక మహిళల మండిపాటు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ వద్ద ఎంఆర్ బార్ నిర్వాహకుల వ్యవహారం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగి కొందరు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. ఎన్‌జిఒస్ కాలనీ ముఖద్వారం వద్ద బార్ అనుమతి ఉందని, నిర్వాహకులు మాత్రం వెనుక భాగంలో అదనంగా ఢాబా ఏర్పాటు చేశారని తెలిపారు. అక్కడ మద్యం తాగిన కొందరు మద్యం ప్రియులు మహిళలు ఉన్నారన్న సంగతి మరిచిపోయి మూత్ర విసర్జన చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి నివాసాలు ఉండే చోట ఢాబా ఏర్పాటుకు అనుమతి ఇవ్వరాదని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మంత్రాలయం : మండలంలోని మాధవరం గ్రామంలోని భీమ ట్రేడర్స్, పంచముఖి ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను ఎఒ జీరా గణేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం భీమ ట్రేడర్స్ దుకాణంలోని రిజిస్టర్‌ను, ఈ-పాస్ మిషన్లను పరిశీలించి దుకాణం యజమాని ఉరుకుంద నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాకును తనిఖీ చేసి పరీక్షలు చేసేందుకు శ్యాంపిల్స్‌ను తీసుకెళ్లారు. ఎలాంటి అక్రమాలు చోటు చేసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నూతన గృహాలకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి

- సబ్ కలెక్టర్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించుకుంటున్న దళితుల గృహాలకు విద్యుత్ లైన్ సదుపాయం కల్పించాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప, వ్యకాస మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. సంతేకుడ్లూరు గ్రామంలో ఆర్‌డిటి, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సహకారంతో ఎస్సీలు గృహాలు నిర్మించుకుంటున్నారని తెలిపారు. ఈ గృహాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంలో వివక్ష చూపుతున్నారని చెప్పారు. వివక్షపై విచారణ జరిపి, విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే సహకారంతో కొంత భూమిని కొని ఆర్‌డిటి సహకారంతో 70 కుటుంబాల దళితులు పునాదులు తీసుకొని ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన నీటి కోసం విద్యుత్ లైన్లు వేయించాలని కోరుతున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు పూటకో ఎస్టిమేషన్ మార్చి, ఎస్టిమేషన్‌ను జిల్లా ప్రణాళిక అధికారికి పంపకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. మొదట రూ.3.50 లక్షలకు ఎస్టిమేషన్ ఇవ్వడం వల్ల కలెక్టర్ సూచనలతో ఎంపీ ల్యాండ్స్ నిధుల విడుదలకు అంగీకరించారని తెలిపారు. తిరిగి విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ సరిపోదంటూ మార్చి చెప్పారని అన్నారు. నిధులు సరిపోకపోయినా ముందు పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఎస్టిమేషన్ వేసి పంపడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు రామప్ప, ముక్కన్న, సిద్ధప్ప, దావీదు, సాలప్ప, ఇమాన్యుయేల్, అమాజీ, వీరేష్, దేవన్న, రాజు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూతన ఎజిపిగా అంజినప్ప

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు మండలంలోని చిన్నతుంబలం గ్రామానికి చెందిన ఎస్.అంజినప్పను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించింది. నియామకానికి సహకరించిన ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి నాయకులు ప్రదీప్ రెడ్డి, ధరణి రెడ్డి, మనోజ్ రెడ్డి, బాపురం చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డికి సోమవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

23 నుంచి కబడ్డీ టోర్నమెంట్

నందవరం : ఈనెల 23 నుంచి నందవరంలో జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు సర్వ రక్షక సేవా సంఘం సభ్యులు, ఆర్గనైజర్స్ వెంకటేష్, నాగరాజ్, భాస్కర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. ఈనెల 23న నందవరంలో జరిగే శ్రీబీరలింగేశ్వర స్వామి దేవర సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నందవరం ఎంపిపి స్కూల్ ఆవరణలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల జట్లు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి జట్టుకు టోర్నీ నియమ, నిబంధనలు వర్తిస్తాయని, మరిన్ని వివరాలకు 97037 53521, 77804 76989, 83099 31902 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

సిఐటియు గ్రామ కమిటీ శ్రమదానం

ఆదోనిరూరల్ : మండలంలోని బల్లేకల్ గ్రామంలో సిఐటియు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానం చేపట్టారు. బల్లేకల్ గ్రామం నుంచి కుప్పగల్ మెయిన్ రోడ్డు వరకు రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. బల్లేకల్ గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా జాతర జరుగుతుంది. జాతరకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుంటారు. రోడ్డుకిరువైపులా ముళ్ల కంప పెరగడంతో ప్రమాదాలు జరుగుతాయని సిఐటియు ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, మండల కార్యదర్శి వీరారెడ్డి, ఆటో యూనియన్ మండల కార్యదర్శి ఈ.వీరేష్, సిఐటియు నాయకులు విరుపాక్షి, వీరేష్, ఈ.ఉరుకుంద, తాయన్న, హనుమంతు, రామాంజనేయులు, తాయప్ప, కృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

ప్రాణాలతో ఆడుకుంటున్న విద్యుత్ అధికారులు

- యుఇఇయు, సచివాలయ ఎనర్జీ సెక్రటరీల అసోసియేషన్

ప్రజాశక్తి - ఆదోని

ప్రమాదకరమైన పనులు చేస్తూ తమ ప్రాణాలతో విద్యుత్ అధికారులు చలగాటమాడుతున్నారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, సచివాలయం ఎనర్జీ సెక్రటరీల అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి నాగన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న వాపోయారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ గ్రౌండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులను క్రమబద్ధీకరించిన ప్రభుత్వం తమను మాత్రం ఎమర్జెన్సీ ఉద్యోగులుగా చూపెట్టడం తగదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జాబ్ చార్ట్‌లో విద్యుత్ స్తంభం ఎక్కడ, దిగడం లేదని తెలిపారు. విద్యుత్తు లైన్‌మెన్ మాత్రం తమతోనే విద్యుత్ స్తంభాలు ఎక్కిస్తూ మరమ్మతు పనులు చేయిస్తున్నారని చెప్పారు. 11 కెవి, 33 కెవి మరమ్మతు పనులు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వందమంది ఎనర్జీ సెక్రటరీలు గ్రేడ్-2 జెఎల్ఎంలు మృతి చెందారని తెలిపారు. మరో 200 మంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని చెప్పారు. కోసిగి మండలం సాతనూరు వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తూ రమణ నాయక్ తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కనీసం ఆస్పత్రి ఖర్చులు కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. సచివాలయంలో తంబ్ వేయిస్తూ విద్యుత్ కార్యాలయంలో విధులు నిర్వర్తించాలని షరతు పెట్టడం వల్ల తమ భవిష్యత్తు అయోమయంలో ఉందని తెలిపారు. తమను రెగ్యులర్ చేసి విద్యుత్ అధికారుల వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే 'చలో సెక్రటేరియట్', విద్యుత్ భవనం ముట్టడి చేపడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు టౌన్ ప్రెసిడెంట్ తిప్పన్న, ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, ట్రెజరర్ రసూల్, మెంబర్లు రాముడు, రాజశేఖర్, ఉద్యోగులు ఉన్నారు.

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయం ఎనర్జీ సెక్రటరీలు

'ప్లాస్టిక్‌పై సమరమే'

ప్రజాశక్తి - ఆదోని

ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని పండిట్ నెహ్రూ రోడ్డులో శానిటేషన్, సచివాలయ ఉద్యోగులతో కలిసి వీధి వ్యాపారులకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జులై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చిందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సామగ్రిపై ప్రస్తుతం దృష్టి సారిస్తున్నామని తెలిపారు. హోటళ్లు, జనరల్ స్టోర్లు, రెస్టారెంట్లలో స్పూన్లు, బాక్సులు, కవర్లు ఉపయోగించరాదన్నారు. వీధి విక్రయదారులు దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయాలు చేయరాదని, వినియోగం నిషేధమని ఇప్పటికే అవగాహన కల్పించామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సంబంధిత వ్యక్తులపై పోలీసు కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఓ జనరల్ స్టోర్‌లో భారీగా ప్లాస్టిక్ నిల్వలను స్వాధీనం చేసుకొని సంబంధిత దుకాణదారులకు రూ.25 వేల వరకు జరిమానా విధించారు. త్వరలోనే వార్డుల వారీగా దుకాణాలను తనిఖీ చేయాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాలని సచివాల ఉద్యోగులకు సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, శ్రీనివాసులు, మేస్త్రీలు తిక్క స్వామి, మహబూబ్ బాషా, నరసింహులు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

వికలాంగుల సాధికారతే లక్ష్యం

- విహెచ్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వికలాంగుల సామాజిక, సంక్షేమ సాధికారతే తమ లక్ష్యమని వికలాంగుల సంక్షేమ హక్కులు, రిజర్వేషన్ల సాధన సమితి (విహెచ్‌పిఎస్) నాయకులు తెలిపారు. సోమవారం పట్టణంలోని వికలాంగుల సంక్షేమ కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించారు. పట్టణ, మండల కమిటీలను ఎన్నుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షులుగా బీసీ.నాగరాజు, అధ్యక్షులుగా బి.రఘువీరా, ప్రధాన కార్యదర్శి గా యు.వీరేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేష్, సహాయ కార్యదర్శిగా కె.ఈరన్న, కోశాధికారిగా సి.నాగరత్నమ్మను ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా బి.రంగన్న, అధ్యక్షులుగా బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఈ.ఈరన్న గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.రాముడు, సహాయ కార్యదర్శిగా జి.కేశన్న, కోశాధికారిగా కె.విజయ్ లక్ష్మిని ఎన్నుకున్నారు. తాలూకా గౌరవాధ్యక్షులుగా మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, అధ్యక్షులుగా కె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బి.పెద్దయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.బసవ రాజు, ఎస్.బాషా, యు.వీరేష్, సహాయ కార్యదర్శులుగా కె.ఉరుకుందు, బి.సోమన్న, కె.గుంటెప్ప, కోశాధికారిగా ఎన్.నాగశేషమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బీసీ.నాగరాజు, సలహాదారులుగా ఈ.లింగన్న గౌడ్, వై.నరసింహులు, బి.తిక్కయ్య, ఎం.నాగరాజు, ఇసి మెంబర్స్‌గా వి.నరసింహులు, ఎం.రామకృష్ణ, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా బి.శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల హాస్టళ్లకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల బాలికల హాస్టళ్లకు స్థలం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఆర్ఐ బసవన్న గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఐద్వా మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు షేకున్‌బీ, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ మండల కో కన్వీనర్ ఇందుశ్రీ, మండల నాయకులు సుమలత మాట్లాడారు. పట్టణంలోని అరికెర రోడ్డులో ఉన్న బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల బాలికల హాస్టల్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినుల విద్య హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోందని తెలిపారు. ఈ హాస్టల్ పక్కనే పాఠశాలల విద్యార్థుల సమీకృత బాలుర వసతి గృహం (సాంఘిక సంక్షేమ హాస్టల్) స్థలంలో గతంలో నిర్మించిన పాత హాస్టల్ భవనం కూలిపోయి స్థలం నిరుపయోగంగా ఉందని చెప్పారు. ఆ స్థలాన్ని బాలికల ఉన్నత విద్య అభివృద్ధి ప్రోత్సాహం కోసం బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల బాలికల హాస్టల్‌కు కేటాయించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాణి, సుస్మిత, ఉషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్

ప్రజాశక్తి - ఆస్పరి

కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్ కోరారు. సోమవారం ఆస్పరి జడ్‌పిహెచ్ స్కూల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిఎఫ్, ఎపిజి ఎల్ఐ, డిఎ అరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.బాబు, కె.గోపి, యుటిఎఫ్ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు రాముడు, ఆదెప్ప, కృష్ణుడు, రాజు, మోహిద్దీన్ బాష, సుంకన్న, వెంకట రాముడు, అల్లన్న, రామాంజినేయులు, శివ, రాజు, ఖలీల్, విజయానంద్ పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి కిలో వెండి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామికి ఒక కిలో 30 గ్రాములతో చేసిన వెండి హారతి పళ్లేన్ని దాతలు విరాళంగా ఇచ్చారని దేవాలయ సహాయ కమిషనర్ వాణి, సూపరింటెండెంట్ వెంకటేష్ తెలిపారు. సోమవారం బళ్లారికి చెందిన వైజి.విశ్వనాథ్ అనే భక్తులు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవాలయంలో రాజగోపురం నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. దేవాలయ వేద పండితులు మురళీమోహన్, కృష్ణ శర్మ, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి

- సంఘం అధ్యక్షులు శాంతయ్య, సర్పంచి భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న నాయకులు

గంగ పుత్రులు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆ సంఘం అధ్యక్షులు హండే శాంతయ్య, సర్పంచి భీమయ్య ఆకాంక్షించారు. సోమవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం నిర్వహించారు. తుంగభద్ర నదీతీరంలో వెలసిన గంగమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ దేవాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ప్రత్యేక వాహనంలో గంగమ్మదేవి, భీష్మాచార్యుల చిత్రపటాలను ఉంచి, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు, యువతులు, చిన్నారులు కలషాలతో గురుకులంలోని ఉసిరి చెట్టు వరకు ఊరేగించారు. అనంతరం ఈఏడాది ఉన్నత చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించి మెమొంటో అందజేశారు. గంగపుత్ర సంఘం పెద్దలు సుంకప్ప, నరసింహా, బంగి భీమయ్య, చిన్న భీమయ్య, హనుమంతప్ప, హండే హనుమంతు, సున్నం రామయ్య, గురు సుంకప్ప, తిప్పయ్య, హండే నరసింహప్ప, బొంబాయి శివ, నాగేష్, పేగుల రాము, హండే భీమేష్, రవి, రాము, కంతం నరసింహ, గురురాజు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో ఉదయం 8 గంటల సమయంలోనూ కురుస్తున్న మంచు

కొత్త మెనూకు అనుగుణంగా..

మెస్ ఛార్జీలు పెంచాలి

- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి అందజేత

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కొత్త మెనుకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. జగనన్న గోరుముద్దలో కొత్త మెనూ మార్పులు పునరాలోచించాలని, ప్రస్తుత మెనూకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీలకు అనుగుణంగా కొత్త మెనూ అమలు చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే చార్జీలు సరిపోవన్నారు. కొత్త మెనూ ప్రకారంగా వేడివేడి ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నా, నిత్యవసర ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 20 రూపాయలు కేటాయిస్తే తప్ప వంటలు పెట్టలేమని తెలిపారు. మెనూలో మార్పుల వల్ల మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల్లో ఆందోళన నెలకొందని, వీటిని ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు విలీనం వల్ల భోజనం కార్మికులకు ఉపాధి పోతుందని, కొత్త మెనూ వల్ల ఇష్టమైన భోజనం ఆ రోజు లేకపోతే విద్యార్థులు ఇండ్లకు వెళ్లి తినడం వల్ల భోజన నిర్వాహకులకు బిల్లులు తక్కువ వస్తాయన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోతే మధ్యాహ్నం భోజనం పథకాన్ని ముందుకు తీసుకెళ్లడం కష్టంగా మారుతుందన్నారు. మరోవైపు తనిఖీల పేరుతో ఇష్టం వచ్చినట్లు అధికారుల తీరు ఉందని, అధికారుల తూకాల ప్రకారంగా కొలతలు వేస్తూ ఈ రకంగా ఉంటేనే వంటలు ఉండండి.. చేతకాకపోతే ఇంటికి వెళ్లిపోండి అంటూ హెచ్చరిస్తున్నారని తెలిపారు. కొన్ని చోట్ల బియ్యం పుచ్చు పట్టడం, పురుగులు ఉండటం, ఎంత జాగ్రత్తలు తీసుకున్నా పురుగులు అక్కడక్కడ కనబడుతున్నాయని, సోనా మైసూర్ బియ్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 5 వేలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, 3 నెలల పెండింగ్ బిల్లులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జగనన్న గోరుముద్దలో కొత్త మెనూ మార్పులు పునరాలోచించాలని, ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు విన్నవించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు ఈశ్వరమ్మ, లక్ష్మి, విజయ గౌరి, లక్ష్మీదేవి, తస్లీమ్, దేవి, వెంకటసుబ్బమ్మ, కళావతి, హుస్సేనమ్మ, పార్వతి బాయి, అరుణకుమారి, మేరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చలి పులి

- పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో చలి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండ్రోజుల కిందట రాత్రివేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉదయం కూడా ప్రభావం చూపుతోంది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తోంది. జిల్లాలో డోన్‌లో పగటి పూట అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం డోన్‌లో అత్యధికంగా 24 డిగ్రీల సెంటిగ్రేడ్, అత్యల్పంగా 19 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు, ఆళ్లగడ్డలో అత్యధికంగా 25 డిగ్రీలు, అత్యల్పంగా 20 డిగ్రీలుగా నమోదైంది. నంద్యాలలో అత్యధికంగా 26 డిగ్రీలు, అత్యల్పంగా 21 డిగ్రీలు, బనగానపల్లెలో అత్యధికంగా 27 డిగ్రీలు, అత్యల్పంగా 21, ఆత్మకూరులో అత్యధికంగా 26 డిగ్రీలు, అత్యల్పంగా 21 డిగ్రీలు, పాణ్యంలో అత్యధికంగా 26 డిగ్రీలు, అత్యల్పంగా 21 డిగ్రీలు, నందికొట్కూరులో అత్యధికంగా 27 డిగ్రీలు, అత్యల్పంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లను కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. చలి పంజా విసురుతుండడంతో ఉదయం, రాత్రి వేళలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులు ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చలికి బయట తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటిలోనూ చలి తీవ్రత పెరిగితే వేడి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మత్స్యకారులకు టూ వీలర్స్, ఐస్ బాక్స్‌లు మంజూరు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో 21 మందికి టూ వీలర్స్, ఐస్ బాక్స్‌లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా ద్వారా ఓఎన్జిసి కార్యకలపాలతో వేట కోల్పోయిన 23 వేల మంది మత్స్యకారులకు రెండో విడత ఆర్థిక సాయంగా రూ.108 కోట్లను బటన్ నొక్కి నగదు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నంద్యాలలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మత్స్య సంఘం ప్రెసిడెంట్ వెంకటస్వామి, మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీలు 21 మంది మత్స్యకారులకు టూ వీలర్స్, ఐస్ బాక్స్‌ల మంజూరు ఉత్తర్వులను పంపిణీ చేశారు.

నర్సాపురంలో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీలు

స్పందన దరఖాస్తులు

గడువులోగా పరిష్కరించాలి

- బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకూడదు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోగా అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 92 రీఓపెన్ దరఖాస్తులు, విథిన్ ఎస్ఎల్ఏలో 1057 దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న 6 దరఖాస్తులు, 24 గంటల్లో పరిష్కరించాల్సిన 10, 48 గంటల్లో వున్న 7, పెండింగులో వున్న 188 ఏపి సేవా సర్వీసులను త్వరితగతిన క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు ప్రాపర్ ఎండార్స్మెంట్ ఇవ్వడంతో పాటు స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. ప్రజా ఫిర్యాదులను కాలపరిమితిలోగా నాణ్యతతో పరిష్కరించడంతోపాటు సంబంధిత క్షేత్రస్థాయి ఫోటోలను కూడ స్పందన పోర్టల్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో కోర్టుకు సంబంధించిన కంటెంప్ట్ కేసులకు కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను వెంటనే అమలు పరచాలని సంబంధిత ఆర్డీవోలు, తాసిల్దార్లను, అన్ని శాఖల జిల్లా అధికారులకు సూచించారు. వార్తాపత్రికల్లో ప్రతిరోజు వచ్చే వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి ఏ రోజుకారోజు యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లతో పాటు రీజాయిండర్లు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- శ్రీశైలంలో లక్షదీపోత్సవం - పుష్కరిణి హారతి
- కాచింతలలో అలరించిన 'రేలారే రేలా'

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నంద్యాల జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

శ్రీశైలం క్షేత్రంలో లక్షదీపోత్సవం-పుష్కరిణి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. లక్ష దీపోత్సవాన్ని దేవస్థానం పుష్కరిణి వద్ద వివిధ రకాల విద్యుత్ దీపాలంకరణలు, దీపోత్సవాలను ఏర్పాటు చేసి స్వామి అమ్మవార్లను పల్లకిలో పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి దీపోత్సవం నిర్వహించారు. అనంతరం పుష్కరిణి వద్ద హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సుప్రభాత, సేవ మహా మంగళహారతి అనంతరం భక్తుల దర్శనానికి అనుమతి ఇచ్చారు. భక్తులను అలరించేందుకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యాగంటికి పోటెత్తిన భక్తులు

బనగానపల్లె : మండలంలోని ప్రముఖశైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కోనేరులో పవిత్ర స్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు ఉమా మహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఇఒ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులు కల్పించారు. పాణ్యం ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో నిత్య అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే రైతు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, వివిధ కులాల సత్రాల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దేవస్థానంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు రామిరెడ్డి, శంకర్ నాయక్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వర నిత్య అన్నదాన (మిగతా 6లో..)

యూనియన్ వివరాల పత్రం అందజేస్తున్న నాయకులు

సచివాలయ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

ఆళ్లగడ్డ : సచివాలయ ఉద్యోగులంతా ఐకమత్యంతో ఉండాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలస్వామి అన్నారు. సోమవారం పట్టణంలో మున్సిపాలిటీ సచివాలయ ఉద్యోగుల సంఘం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులుగా బాలస్వామి ఉపాధ్యక్షులుగా సురేష్ కుమార్, శ్రీలేఖ, కార్యదర్శిగా ఆంజనేయులు, సమన్వయకర్తలుగా చెన్నకేశవరెడ్డి, మౌలాలిలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుని కలిసి తమ యూనియన్‌కు సంబంధించిన వివరాలను తెలుపుతూ సమాచార పత్రాన్ని అందజేశారు. సచివాలయ ఉద్యోగుల ఐకమత్యం కోసమే యూనియన్ స్థాపించినట్లు బాలస్వామి తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సభ్యుల సహకారంతో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

రేషన్ పంపిణీలో ప్లాస్టిక్ బియ్యం

శిరివెళ్ల : మండలంలోని వీరారెడ్డి పల్లె గ్రామంలో చౌకదుకాణంలో పంపిణీ చేసిన బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు ప్లాస్టిక్ బియ్యం రావడానికి గల కారకులను గుర్తించి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, డీలర్‌పై విచారణ జరపాలని గ్రామ వైసిపి నాయకులు తలారి పెద్ద బాలయ్య కోరారు.

టంగుటూరి శీనయ్యను పరామర్శించిన బిసి రాజారెడ్డి

బనగానపల్లె : పట్టణానికి చెందిన టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్యను పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి సోమవారం పరామర్శించారు. టంగుటూరి శీనయ్య ఇటీవలే ఆయన వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను బిసి రాజారెడ్డి అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పక్కిరెడ్డి, వార్డు మెంబర్ అత్తార్ కలాం పాల్గొన్నారు.

టంగుటూరి శీనయ్యను పరామర్శిస్తున్న బిసి రాజారెడ్డి

ఘనంగా మల్లేశ్వర స్వామి తిరుణాల మహోత్సవం

ప్రజాశక్తి కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం బందర్ల పల్లె గ్రామంలో వెలసిన నేల బిళం మల్లేశ్వర స్వామి కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తిరునాల మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులతోపాటు కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మహా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ఐ రమేష్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చింతలాయిపల్లి సర్పంచి లక్ష్మి నారాయణ యాదవ్, మాజీ ఎంపీటీసీ జయ రామకృష్ణ యాదవ్, అంబటి చంద్రమోహన్ రెడ్డి, బందర్ల పల్లె సర్పంచి స్వర్ణలత, వైసిపి నాయకులు యాతం వెంకట శివ రామిరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మాజీ జెడ్పీటిసిఉదయ్ భాస్కర్ రెడ్డి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, యాతం వెంకట శివ రామిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం చేస్తున్న వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువు రెడ్డి

సంతకాలు చేశారు.. వెళ్లిపోయారు..

- రిజిస్టర్‌లో 12 మంది.. - స్పందనలో మాత్రం నలుగురు అధికారులే..

ప్రజాశక్తి - అవుకు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు రిజిస్టర్లో సంతకాలు చేసి వెళ్ళవచ్చునా అని మండల ప్రజల ప్రశ్నిస్తున్నారు. అవుకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 12 మంది అధికారులు రిజిస్టర్లో సంతకాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్పందన కార్యక్రమానికి విలేకరులు వెళ్లి చూడగా అక్కడ కేవలం తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ అజాం ఖాన్, వ్యవసాయ అధికారి ప్రసాదరావు, సిడిపిఒ ఉమా మహేశ్వరమ్మలు మాత్రమే ఉన్నారు. మిగిలిన 8 మంది అధికారులు సంతకాలు చేసి అక్కడ లేకపోవడాన్ని గమనించి అధికారులను ఈ విషయంపై అడగగా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు స్పందన కార్యక్రమం మొదలై మధ్యాహ్నం 2 గంటల వరకు జరగాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 12 గంటల సమయంలోనే నలుగురు అధికారులు ఉన్నారంటే ఇంకా 2 గంటలకు ఇంకా



స్పందనలో పాల్గొన్న నలుగురు అధికారులు

రిజిస్టర్‌లో మాత్రం 12 మంది అధికారులు చేసిన సంతకాలు

శ్రీశైలంలో దేవదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లను దేవదాయ శాఖ కమిషనర్ దర్శించుకున్నారు. ఆదివారం కమిషనర్ కుటుంబ సమేతంగా శ్రీశైలం చేరుకున్నారు. సోమవారం స్వామి అమ్మవాలను దర్శించుకునేందుకు కమిషనర్ ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, వేదపండితులు, దేవాలయాల ప్రధాన అర్చకులు వేర్వేరుగా సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం వీరికి శేష వస్త్రా, ప్రసాదాలను, జ్ఞాపికను ఇఒ అందజేశారు.

నయనాలప్ప క్షేత్రాన్ని దర్శించిన రాజకీయ ప్రముఖులు

సంజామల : మండలంలోని నయనాలప్ప క్షేత్రాన్ని సోమవారం పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి వెంకట సుబ్బారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, భూమా కిషోర్ రెడ్డిలు క్షేత్రాన్ని దర్శించుకున్నారు.

నయనాలప్ప క్షేత్రంలో ఎమ్మెల్యే తనయుడు తదితరులు

వ్యాధుల నివారణలో ఆయుర్వేదం కీలకం

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

ఆధునిక జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులు నివారించడంలో ఆయుర్వేదం ప్రతిభావంతంగా పని చేస్తుందని పలువురు ఆయుర్వేద వైద్యులు తెలిపారు. సోమవారం ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల ఆయుష్ విభాగం, ఆరోగ్య భారతి సంయుక్తంగా ఫరూక్ నగర్లోని శ్రీ శారదా విద్యా పీఠం పాఠశాల నుండి ఆత్మకూర్ బస్టాండ్ గాంధీచౌక్, శ్రీనివాసనగర్ మీదుగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డా. జి.యశోధర, డా.శ్రీదేవి ఆయుర్వేద వైద్యం వలన కలిగే ఫలితాలను వివరించారు. సమావేశానికి అతిథిగా నంద్యాల డిఎస్‌పి సి.మహేశ్వర రెడ్డి, ప్రధాన వక్తలు డా. పి.మురళీకృష్ణ, ప్రముఖ వైద్యులు డా. జి.సహదేవుడు, పాఠశాల హెచ్‌ఎం మనోహర్ నాయుడు, ఆయుష్ విభాగ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు డాక్టర్ గెలివి సహదేవుడు, డా. శ్రీదేవి, వ్యాపారవేత్త జెవి ప్రసాద్, ప్రముఖ రైతు సుబ్రహ్మణ్యం, ఆయుష్ శాఖలో పని చేస్తున్న ఏ. వీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలి : జెడ్పిటిసి

ప్రజాశక్తి - గడివేముల

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని జడ్పిటిసి ఆర్‌బి.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం గ్రంథాలయాధికారి వి. వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి ఆర్‌బి.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మహేశ్వర రెడ్డిలు హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి రామకృష్ణా రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ మాసపత్రిక వారు సంయుక్తంగా ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో నంద్యాల క్రాంతినగర్‌కు చెందిన యువకవి పి.రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన రచించి వినిపించిన 'ఎవరు నువ్వు' కవితాగానం పలువురిని ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు, సంస్కృత భాష సంఘం అధ్యక్షురాలు డా.నందమూరి లక్ష్మి పార్వతి ప్రత్యేకంగా అభినందించారు. ఇందుకు ప్రత్యేకంగా సహకరించిన బిక్కి కృష్ణ, మల్లెతీగ మాసపత్రిక సంస్థాపకులు కలిమిశ్రీ, చిత్రాడ కిషోర్ కుమార్, శేఖర్, సంపత్‌లకు కవి రామకృష్ణా రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పిడిఎస్‌యు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

ఏలూరు పట్టణంలో ఈ నెల 25, 26, 27వ తేదీలలో జరిగే పిడిఎస్‌యు 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నంద్యాల డివిజన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఉపాధ్యక్షుడు సతీష్, సహాయ కార్యదర్శి చెన్నయ్య, నాయకులు ప్రసాద్, రవి, రమణ తదిరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి

పాణ్యం : పాణ్యం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బస్టాండ్ వెనుక ఉన్న ఆర్అండ్‌బి స్థలం కేటాయించాలని ఆర్‌విఎఫ్, ఎఐఎఫ్‌బి నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌విఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బత్తిని ప్రతాప్, ఎఐఎఫ్‌బి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వనం వెంకటాద్రి మాట్లాడుతూ పాణ్యం మండలం చుట్టూ దాదాపు 24 గ్రామాలు ఉండగా అందులో డిగ్రీ కాలేజ్ చదివే విద్యార్థులు 3 వేల మంది దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అదే డిగ్రీ కాలేజీ పాణ్యంలో ఏర్పాటు చేస్తే విద్యార్థులంతా ఇక్కడే చదువుకుంటారని తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల ప్రధాన నాయకుడు బాలకృష్ణ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మీ స్టిక్కర్ విడుదల చేస్తున్న కలెక్టర్

వీర జవాన్ల త్యాగనిరతిని స్మరించుకుందాం

- ఆర్మీ స్టిక్కర్లు విడుదల చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వీర జవాన్ల త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ పర్యవేక్షకులు మహేంద్రమ్మతో కలిసి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆర్మీ స్టిక్కర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్రిసాయుధ దళాల పతాక దినోత్సవంను ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా డిసెంబర్ 7న జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు, వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆదుకుని మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. కాటసాని ఓబుల్ రెడ్డి సోమవారం బనగానపల్లె నుండి నయనాలప్ప తిరుణాల మహెూత్సవాలకు వెళ్తుండగా గుళ్ళదుర్తి సమీపంలో ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయపడిన వారిని చూశారు. వెంటనే ఆయన కారు ఆపి క్షతగాత్రులను పరిశీలించి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ రాగానే వారిని ఎక్కించి ఆస్పత్రికి తరలించారు.

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి స్వాగతం పలుకుతున్న పురోహితులు

కొలను భారతి క్షేత్రంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో రాష్ట్ర శాప్ చైర్మన్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస చివరి సోమవారం కావడంతో సిద్ధార్థ రెడ్డి కొలనుభారతి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పురోహితులు ఆలయ మర్యాదలతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, వైస్ ఎంపీపీ సింగారం రంగా, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, మండల నాయకులు జనార్దన్ రెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచులు నిత్య లక్ష్మీదేవి, బాల ఎల్లయ్య, ఎంపీటీసీలు శివన్న, అల్లి బాష, బాలరాజ్, కో ఆప్షన్ నెంబర్ మహమ్మద్ గౌస్, మండల వైసీపీ నాయకులు మహబూబ్ బాషా, ముని లోకేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి, రామకృష్ణుడు, మా బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆత్మకూరు పట్టణంలోని 4,9,10వ వార్డులలో పర్యటించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, స్థానిక కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగారు. కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని రావడం అప్పటికప్పుడు అధికారులు పిలిచి ఆ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రావు, ట్రాన్స్ ఎఇ రమేష్ బాబు, ఎంఈఓ జానకిరామ్, కౌన్సిలర్ సుల్తాన్, కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, సుగుణమ్మ, పాణ్యం పార్వతితో పాటు ఆత్మకూరు పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

జూపాడుబంగ్లా: అర్హత ఉంటే చాలు కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. అర్హతే సంక్షేమానికి కొలమానం అన్నారు. సోమవారం తూడిచెర్ల గ్రామంలో ఎమ్మెల్యే ఆర్థర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు నేరుగా డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో డబ్బుల జమచేయడంతో అవినీతి, లంచగొండితనం పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాల మద్దిలేటి, తహశీల్దార్ పుల్లయ్య, ఈఓఆర్డి మనీ మంజరి, ఏపిఎం అంబమ్మ, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, నాయకులు మాధవరం దేవసహాయం, పల్లె శివానందరెడ్డి, కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూడిచెర్ల గ్రామంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

తెలుగు గంగలోకి చేప పిల్లలు

- విడుదల చేసిన ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - వెలుగోడు

చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మత్స్యశాఖ దినోత్సవం సంధర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వెలుగోడు తెలుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లోకి కట్ల, రోహు రకానికి చెందిన చేప పిల్లలను మొత్తం తొమ్మిది లక్షల చేప పిల్లలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సోమవారం విడుదల చేశారు. అంతకు ముందు మత్స్యశాఖ జేడీ రాఘవ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు రమణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి తెలుగు సంఘం వారు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ రమేష్, సర్పంచ్ జయపాల్, మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్, మదీనా షంషీర్ మండల ప్రజలు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల 27, 28 తేదీలలో పట్టణంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ ఈశ్వరయ్య, ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయం నందు సోమవారం మండల కార్యదర్శి ఎన్ హైమావతి అధ్యక్షతన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో మొదటి రోజున మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీ చైతన్య స్కూలు ఆవరణము నుండి స్థానిక కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండవ రోజు బేతంచెర్ల సంజీవ్ నగర్ కాలనీ లోని శ్రీ మురళీధర్ రెడ్డి ఫంక్షన్ హాల్ నందు ప్రతినిధుల మహాసభ జరుగుతుందని వారు తెలియజేశారు. కేరళ ప్రభుత్వం లాగా అన్ని మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పనులు కల్పించాలని, భూమి లేని నిరుపేదలకు 2ఎకరాలు భూ పంపిణీ చేయాలని, ఉపాధి కూలీలందరికీ పనిముట్లు అందజేసి ఉపాధి కూలీలకు ఐదు సెంట్ల స్థలము ఇచ్చి ఇల్లు నిర్మించి ప్రభుత్వ ఇవ్వాలని, వారు కోరారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల మండలం సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు వైబి వెంకటేశ్వర్లు, వై ఎల్లయ్య, ఎన్. బాలయ్య. రాజబాబు, నరసింహులు, వెంకటరమణ, అర్జున్ వెంకటేశ్వర్ల నాయక్. తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నాగేశ్వర రావు

దేవాలయ నిర్మాణానికి విరాళం

కోవెలకుంట్ల : పట్టణంలోని స్థానిక జమ్మలమడుగు రోడ్డు నందు నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి పలువురు విరాళం అందించినట్లు ఆలయ నిర్మాణ కృషి ధర్మకర్త బి లక్ష్మయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి కల్యాణ విగ్రహానికి కోవెలకుంట్ల పట్టణానికి చెందిన కొంకా రామకృష్ణ మూర్తి వారి ధర్మ పత్ని భారతి రు. 82500లు విరాళం అందజేశారని తెలిపారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

రుద్రవరం : రుద్రవరంలోని బొరుగుల పేటలో సోమవారం జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. రుద్రవరం పంచాయతీ 9వ వార్డుకు చెందిన గంగుల అభిమాని గుర్రాల మౌలాలి కుమారుడి వివాహానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు రుద్రవరం మండలం వైసిపి సీనియర్ నాయకులు గంధం వీర రాఘవ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరుముద్ద కొత్త మెనూను పరిశీలించిన ఎంఇఒ

అవుకు : మండలంలోని గుండ్ల సింగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న జగనన్న గోరుముద్ద కొత్త మెనూ ఆహారాన్ని ఎంఇఒ శ్రీధర్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాత మెనూ తీసివేసి కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన పోషక విలువలు కలిగిన జగనన్న గోరుముద్దను విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. కొత్త మెనూలో సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కిలను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు జగనన్న గోరుముద్దను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

నంద్యాల : వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని వడ్డెర సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వడ్డెరలందర్నీ ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. జిల్లా నాయకులు మంజుల సుబ్బరాయుడు, చల్లా మద్దిలేటి, మంజుల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మహానంది వడ్డెర అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు నారాయణ, కోయిలకుంట్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిబి పేషెంట్‌కు పోషకహారం పంపిణీ

కోవెలకుంట్ల : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో టీబీ యూనిట్ నందు వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా టీబీ పేషెంట్‌కు ఎస్‌టిఎల్‌ఎస్ కడియం శివకుమార్ పోషకాహారాన్ని అందించారు.

సోమవారం నాడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టీబీ యూనిట్ నందు పనిచేస్తున్న శివకుమార్ భారత్ టీబీ ముక్తి అభియాన్ పథకంలో భాగంగా పేషెంట్‌కు ఆరు నెలలపాటు అవసరమయ్యే పోషకాహారాన్ని అందిస్తానని ముందుకు వచ్చారన్నారు. శివ కుమార్‌ను డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎస్‌లు పరమేశ్వర్ రెడ్డి, రవికుమార్, ఆశ వర్కర్ అమృతాలు పాల్గొన్నారు.

భౌతిక కాయానికి బిసి నివాళి

కొలిమిగుండ్ల : రోడ్డు ప్రమాదంలో మరణించిన అంకిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన చెలమారెడ్డి గారి కుమార్తె భౌతిక కాయానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, పూలమాలవేసి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బిసి వెంట టిడిపి మండల అధ్యక్షుడు రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతూన మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి

హైకోర్టును అడ్డుకుంటే టిడిపికి అభ్యర్థుల కరువు

- మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాయలసీమ ప్రజల మనోభావాలను దెబ్బతినేలా హైకోర్టును అడ్డుకుంటున్న టిడిపికి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ కర్నూల్ లో జిల్లాలో ఆ పార్టీకి అభ్యర్థులు కరువైతారని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం చాగలమర్రిలో వైసిపి నాయకుడు ముల్లా ఖాజా రసూల్ కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూల్ పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనోభావాలు దెబ్బ తినేలా మాట్లాడడం ఆయన రాజకీయ అనుభవానికి సరైనది కాదన్నారు. ఆయన మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడో లేక ఉద్దేశపూర్వకంగా మాట్లాడుతున్నారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. శ్రీబాగ్ వడంబడిక ప్రకారం కర్నూల్లో హైకోర్టు ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. చాగలమర్రి లో సరిహద్దుల వరకు పిఎస్ డాబా నుండి జిల్లా సరిహద్దుల వరకు వారిని పాత జాతీయ రహదారిని తారు రోడ్డు వేస్తున్నారన్నారు. అలాగే పెద్ద బోధనం లో ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్డును పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కోఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజుద్దీన్, జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు వెంకట రమణ, చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ సోహెల్, సర్పంచులు బంగారు షరీఫ్, గోవిందయ్య, సాగునీటి సంఘ అధ్యక్షులు శేషు రమేష్, వైసిపి నాయకులు ఆర్ఎస్ రమణగుప్త, బచ్చు సుబ్రహ్మణ్యం, టీ నాగేంద్ర, ఖాదర్బాషా, రమణారెడ్డి, గేట్ల మాబుష, షాబుల్ మొహిద్దిన్ , ముల్లా అజిముద్దీన్, భారత్ గ్యాస్ రఫీ , షబ్బీర్, ముల్లా ఇబ్రహీం, ముల్లా బ్రాందీన్, రెహమాన్ మండల ప్రజా ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణాలు రీ షెడ్యూల్ చేయాలి

- రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

రైతులకు షరతులు లేకుండా రుణాలు రీ షెడ్యూల్ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎడిబి బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీ సీజన్లో రీ షెడ్యూల్ చేయడానికి రైతులు డబ్బులు చెల్లిస్తేనే లోను రెన్యువల్ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. పెట్టుబడులు పెరిగాయని,స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఇచ్చేటువంటి పంటలకు రుణం ఏమాత్రం సరిపోవటం లేదని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న, మిరప, ఉల్లి, పత్తి, సెనగ, తదితర పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలను సడలించి ఎకరాకు రెండు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. సివిల్ సరిగా ఉంటేనే లోన్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రైవేట్ సివిల్‌తో సంబంధం లేకుండా సుప్రీంకోర్టు నిబంధన ప్రకారం రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఇబ్బందులకు గురి చేస్తున్న ఫీల్డ్ ఆఫీసర్లపైన అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏడిబి మేనేజర్ విల్సన్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సువార్తమ్మ, రైతు సంఘం నాయకులు మద్దిలేటి, కృపాకర్, శివ రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం మిడుతూరు మండల కార్యదర్శి ఓబులేష్, సీఐటీయూ నాయకురాలు ఆర్ జయరాన్ని, మహిళా సంఘం నాయకురాలు ఎస్. బేబీ, నాగలక్ష్మి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మల్లేశ్వర స్వామి తిరుణాలలో బిసి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని బందర్లపల్లె గ్రామంలో వెలసిన నేల బిళం మల్లేశ్వర స్వామి కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా జరిగిన తిరునాళ్ల మహెూత్సవానికి టిడిపి గ్రామ నాయకుల అహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి హాజరై మహ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవం కార్యక్రమ ంలో నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల అధ్యక్షుడు ఎం.రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, విఆర్ లక్ష్మిరెడ్డి, బందర్ల పల్లె కళ్యాణ్ రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, మండల యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్, వివేక్ రెడ్డి, ప్రచార కార్యదర్శి ఎం శివరామిరెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే,

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- పత్తి రైతులు సద్వినియోగం చేసుకోండి : మార్కెటింగ్ ఏడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. సోమవారం ఆయన పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై విలేకరులతో మాట్లాడారు. సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, పత్తి పంట సాగు చేసిన కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. పత్తి చిన్నపింజకు క్వింటాళ్లుకు రూ.6,080, పెద్ద పింజకు రూ.6380 ధరకు సిసిఐ వాళ్ళు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తాము పండించిన పంటను ఈ క్రాప్ లో నమోదు చేసుకొని ఉండాలని ఆయన తెలిపారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో ఈ క్రాప్ సర్టిఫికెట్ చూపించి పత్తి అమ్ముకోవచ్చని ఆయన వెల్లడించారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం : డాక్టర్ రజని

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండి పెంటలోని ప్రభుత్వ వైద్యశాలలో కాలనీవాసులకు, యాత్రికులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డాక్టర్. రజిని అన్నారు. ప్రభుత్వ వైద్యశాల నందు సోమవారం స్థానికంగా ఉన్న వివిధ ప్రజాసంఘాల నాయకులతో వైద్యంపై మాట్లాడుతూ గతంలో వైద్యశాల యందు సిబ్బంది కొరత, అడపా దడప మందుల కొరత తదితరవి చేయడం కొంత ఇబ్బందికరంగా ఉందని ప్రస్తుతం ఆసుపత్రి నందు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు గ్రామ కమిటీ సేవా సంఘం అధ్యక్షులు కత్తుల కోటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఆశీర్వాదం, ఆర్. కృష్ణయ్య, బిజెపి నాయకులు సోమిశెట్టి మల్లికార్జున, నల్లబోతుల మల్లికార్జున ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెరగాలి

జూపాడుబంగ్లా : బాలలు, మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎన్. నరసింహులు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థినులను ద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో సమస్యలపై ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని కోరారు. ఎవరి నుంచైనా లైంగిక వేధింపులు ఎదురైతే నిర్భయంగా తనకు గాని, ఉన్నతాధికారులకు గాని చెప్పాలని సూచించారు. మెనూ అమలులో, మౌలిక సదుపాయాల కల్పనలో సమస్యలుంటే చెప్పాలని కోరారు. బాలికలను తక్కువ చేసి చూడడం తల్లిదండ్రులే మానుకోవాలన్నారు. బాలికల విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో లోపాలుంటే ఎత్తిచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నాయకులు నాగేశ్వరరావు, కస్తురిబా స్కూల్ స్పెషల్ ఆఫీసర్ యశోధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ యశోధ

రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పసుపుల గుండం మల్లికార్జున స్వామి దేవస్థానంలో రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్ ప్రారంభించారు. ఈ పోటీలలో 34 జతల వృషభాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నల జనార్దన్ రెడ్డి, ఉపసర్పంచ్ హేమలత, ఎంపీటీసీ మహేశ్వరి, ఆలయ ధర్మకర్త రాజేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** మండలంలోని నయనాలప్ప క్షేత్రంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా బిజెపి ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి ఎద్దుల పందెములను ప్రారంభించారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ గంగుల

5వ పేజీ తరువాయి... సంస్థ కార్యదర్శి దొనపాటి యాగంటి రెడ్డి, ఉపాధ్యక్షులు మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, దేవస్థానం పాలకమండలి సభ్యులు యామ చిన్న పుల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, బింగిమళ్ళ హనుమాన్ శెట్టి, నాయకులు పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, జోలాపురం తిరుపాల్, మీరాపురం మనోహర్ రెడ్డి, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరంతో పాటు పలు గ్రామాలలో కార్తీక మాస వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక భాస్కర నందీశ్వర, తాటి మాను గుర్రప్ప స్వామి ఆలయం, గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, దుర్వి చెంచులక్ష్మి నరసింహస్వామి ఆలయం, లింగమయ్య స్వామి ఆలయంతో పాటు నల్లమల ప్రాంతంలో వెలిసిన ఉల్లెడ మల్లేశ్వర స్వామి, రుద్రవరం సమీపంలోని శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. **గడివేముల :** మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పాణ్యం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ బిటి వెంకటసుబ్బయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారిచంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ గోపాలయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. **అవుకు :** మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయాలకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగించి పూజలను నిర్వహించారు. పట్టణంలోని కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వద్ద భక్తులకు ఆలయ భజన బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. **ఉయ్యాలవాడ :** మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో పొటేత్తాయి.

భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేములలో..

కాచింతలలో లక్ష మంది భక్తులకు అన్నదానం

ఆళ్లగడ్డ : పట్టణ శివారులో ఉన్న కాచింతల కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చి వకులా నదిలో పుణ్యస్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన దాదాపు లక్ష మంది భక్తులకు చింతకుంట రంగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. డిఎస్పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాశీ విశ్వేశ్వరుని దర్శించుకున్న మండలి విప్ గంగుల

: కాచింతలలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్దకు ఆయన చేరుకోగానే అర్చకులు, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే చింతకుంట ఇంజేటి రంగేశ్వర్ రెడ్డి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నం వడ్డించారు.

కొలిమిగుండ్ల లో..

అలరించిన రేలారే రేలా : భక్తుల వినోదం కోసం నిర్వాహకులు రేలారే రేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జబర్దస్త్ జీవన్‌తో కూడిన బృందం రేలారే రేలా కార్యక్రమం నిర్వహించారు. **బండి ఆత్మకూర్ :** నల్లమల అభయారణ్యంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయానికి నాలుగవ ఆర్థిక సోమవారం సందర్భంగా వేలాదిగా భక్తులు రావడంతో ఓంకార పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. పెద్ద ఎత్తున భక్తులు ఓంకార సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని కార్తీకదీపం వెలిగించి పూజలు చేశారు. ఓంకార దేవస్థానం చైర్మన్ ఏ విశ్వనాథరెడ్డి, ఆలయ అధికారి మోహన్‌ల ఆధ్వర్యంలో క్యూలైన్లో ఏర్పాటు భక్తులకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేశారు. **ఓంకారంలో ట్రాఫిక్ అంతరాయం :** వేలాదిగా భక్తులు వాహనాలతో రావడంతో రోడ్డు సరిగా లేక ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ఎంత ప్రయత్నిస్తున్న వాహనదారులు అడ్డదిడ్డంగా రావడం రోడ్డు సరిగా లేకపోవడం ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దాదాపు 30 వేల మంది భక్తులు ఆలయ దర్శనానికి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు వెంటనే చెల్లించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చేయాలని భక్తులు కోరుతున్నారు. **చాగలమర్రి :** మండలంలోని శివాలయాలలో కార్తీక కడ సోమవార పూజలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుండే మహిళలు అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి అభిషేకాలు చేశారు. అలాగే మహిళలు వెలిగించిన దీపాలతో ఆలయాలు వెలిగిపోయా యి. ఈ సందర్భంగా మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలో గల భైరవేశ్వర ఆలయంలో , చిన్న వంగలి గ్రామ సమీపంలోని నల్లమల అటవీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో, అలాగే చాగలమర్రి పట్టణంలోని శ్రీ చాగలమ్మ ఆలయంలో భక్తులకు పెద్ద ఎత్తున వనభోజనాలను ఏర్పాటు చేశారు. భక్తులు తండోపతండాలుగా శైవ క్షేత్రాలకు తరలి రావడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. **ఆత్మకూర్ :** పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటికీటలాడాయి. దేవాలయాల వద్ద కార్తీకాలతో దీపారాధన చేయడం పూజలు చేశారు. **పాములపాడు :** మండల కేంద్రంలో కార్తీకమాసం చివరి సోమవారం శివ బ్రహ్మ ఆశ్రమం నందు గ్రామ పెద్దలు, నిర్వాహకులు వనభోజన భోజన కార్యక్రమాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి సంవత్స రం కార్తీక మాసంలో శివ బ్రహ్మ ఆశ్రమం నందు వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. **బేతంచెర్ల :** మండల పరిధిలోని శ్రీ ముచ్చట్ల మల్లికార్జున భ్రమరాంబిక ఆలయనికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు హెచ్ కొట్టాల, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, రైతుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.